క్లుప్తంగా

కృష్ణా కళాశాలలో ఎన్‌సీసీ ఎంపిక ప్రక్రియ



ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ అధికారులు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎన్‌సీసీ ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో చేరిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఎన్‌సీసీలో ప్రవేశానికి అవకాశం కల్పించారు. 13ఏ బెటాలియన్, ఎన్‌సీసీ అధికారులు ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. 36 క్యాడెట్ల ఖాళీలను భర్తీ చేయనున్నామని కళాశాల ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు తెలిపారు. వీరిలో 24 మంది పురుషులు, 12 మంది మహిళలను ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 13ఏ బెటాలియన్‌కు చెందిన సుబేదార్ సుజాన్ సింగ్, పీఐ స్టాఫ్ ఆనంద్‌సింగ్, బసంత్‌సింగ్ పాల్గొన్నారు.

కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం శివాలయంలో కొలువుదీరిన కాలభైరవ స్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అరవెల్లి ప్రకాశ్‌శర్మ, బాల భాస్కర శర్మ భక్తుల పేరిట అర్చనలు నిర్వహించారు.

26 నుంచి రాజస్థాన్‌లో జాతీయ మీడియా సదస్సు

దాబాగార్డెన్స్: బ్రహ్మకుమారీస్ అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలు ప్రశంసనీయమని విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. బ్రహ్మకుమారీస్ నేతృత్వంలో రాజస్థాన్ మౌంట్‌అబూలో నిర్వహించనున్న జాతీయ మీడియా సదస్సుకు సంబంధించిన పోస్టర్ సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సును విశాఖ జర్నలిస్టులు విజయవంతం చేయాలని కోరారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రామేశ్వరి మాట్లాడుతూ ఈ ఏడాది సెప్టెంబర్ 26 నుంచి 30 వరకు జరిగే ఈ సదస్సులో పాల్గొనే పాత్రికేయులు ఈనెల 12వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వచ్చేనెల 24న విశాఖలో మీడియా ప్రతినిధుల బృందం రైలులో రాజస్థాన్ బయలుదేరుతుందని చెప్పారు. వివరాలకు 85558 57990 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ అనాటమీ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మణరావు, బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు సిద్ధు, మురళీకృష్ణ, సునీత, నారాయణ, అనురాధ, సింహాచలం దేవస్థానం మాజీ ధర్మకర్త గంట్ల శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం సందర్శన



కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర కో–ఆర్డినేటర్ అమ్మినాయుడు

మహారాణిపేట: స్థానిక అచ్యుతరామ ప్రాథమిక పాఠశాలలో ఉన్న భవిత కేంద్రాన్ని రాష్ట్ర సహిత విద్యా కోఆర్డినేటర్ అమ్మినాయుడు సోమవారం సందర్శించారు. కేంద్రంలో పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఆనంద్, భవిత టీచర్లు పి.శ్వేత, పి.ప్రతిమ, ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి పనులు అక్కడే..!

- ‘తూర్పు’లో పడకేసిన అభివృద్ధి
- ముందుకు కదలని నిర్మాణాలు



తోటగరువు వద్ద నిలిచిపోయిన డబుల్ రోడ్డు నిర్మాణం

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో పలు చోట్ల అభివృద్ధి పనులు పడకేశాయి. ఈ ఏడాది మేలో జరిగిన సాధారణ ఎన్నికల ముందు చకచకా జరిగిన అభివృద్ధి పనులు ఇప్పుడు మచ్చుకైనా కనిపించడం లేదు. మరో వైపు గత ప్రభుత్వంలో తలపెట్టిన నిర్మాణాలు ఇప్పుడు మధ్యలో ఆగిపోయాయి. జీవీఎంసీ జోన్–2 పరిధి ఆరిలోవ ప్రాంతంలో మధ్యలో నిలిచిపోయిన పనులు ఎక్కువగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు పూర్తయితే వినియోగంలోకి వస్తాయని ఎదురుచూస్తున్న ఇక్కడ స్థానికులకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిరాశ ఎదురవుతోంది. పెదగదిలి కూడలి నుంచి తోటగరువు వరకు, తోటగరువు కూడలి నుంచి బాలాజీనగర్ దుర్గాలమ్మ గుడి మీదుగా అంబేడ్కర్ కూడలి వరకు తలపెట్టిన డబుల్ రోడ్డు, ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద కల్యాణ మండపం విస్తరణ పనులు, రైతుబజార్ నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి.

కల్యాణ మండపం ఇప్పట్లో పూర్తయ్యేనా!



ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద పునాది దశలో ఉన్న కల్యాణ మండపం విస్తరణ పనులు

జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ వద్ద కల్యాణ మండపం ఆధునికీకరణ పనులు చేపట్టారు. సుమారు 12 ఏళ్ల క్రితం జీవీఎంసీ ఇక్కడ కల్యాణ మండపం నిర్మించింది. ఈ కల్యాణ మండపం ఆరిలోవ కాలనీవాసులకు అందుబాటులో ఉండేది. సుమారు మూడేళ్లుగా ఇది మూతపడింది. ప్రారంభం నుంచే దీనిలో సౌకర్యాలు లేకపోవడం, మొదటిలో భవన నిర్మాణం సరిగా జరగకపోవడంతో ఇది సుమారు పదేళ్లకే శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని జీవీఎంసీ అధికారులు ఈ కల్యాణ మండపం ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. ఇందు కోసం రూ.60 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో కల్యాణ మండపం ఆధునికీకరణలో భాగంగా అదనపు గదులు నిర్మాణ పనులు ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించి కోలమ్స్ వేసి వదిలేశారు. అదనపు భవనం నిర్మాణంతో పాటు వంట గది, విశ్రాంతి గదుల నిర్మాణం, పాత భవనం మరమ్మతులు చేపట్టి, సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులు జరగకపోవడంతో ఇప్పట్లో ఈ మండపం వినియోగంలోకి వచ్చే అవకాశం లేదని స్థానికులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే ఆరిలోవతో పాటు దుర్గాబజార్, నలభై గజాల కాలనీ, శ్రీకాంత్‌నగర్, టీబీసీ పాయింట్ వరకు ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

అతీగతీ లేని రూ.7 కోట్ల డబుల్ రోడ్డు నిర్మాణం

జీవీఎంసీ 10, 11, 12 వార్డుల పరిధిలో ఉన్న పెదగదిలి కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం జీవీఎంసీ గతేడాది డిసెంబరులో పనులు ప్రారంభించింది. దీని కోసం సుమారు రూ.7 కోట్లు కేటాయించింది. సుమారు కిలోమీటరు పైగా ఉన్న ఈ రోడ్డు ఇరువైపులా అవసరమైన చోట్ల విస్తరించి మధ్యలో డివైడర్ నిర్మించడం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో పాటు ఫుట్‌పాత్‌లు నిర్మించి అందంగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక రూపొందించింది. ఈ పనులు మార్చి వరకు చురుగ్గా సాగాయి. ఎన్నికల కోడ్ పేరుతో మధ్యలో జరుగుతున్న పనులను నిలిపేశారు. పెదగదిలి సమీప ఎర్నిదుర్గమాంబ గుడి నుంచి తోటగరువు వరకు డివైడర్ కోసం గోడలు నిర్మించి వదిలేశారు. బాలాజీనగర్‌లో రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మాణం కోసం తవ్వేసి వదిలేశారు. దీంతో ఇక్కడ గోతులుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.



మధ్యలో నిలిచిపోయిన బాలాజీనగర్‌లో డబుల్ రోడ్డు నిర్మాణం

రైతుబజార్ కల నెరవేరేనా?



వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేసిన రైతుబజార్

ఆరిలోవ ప్రాంతానికి ఎన్నో ఏళ్లుగా తీరని కలగా మిగిలిపోయిన రైతుబజార్ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శ్రీకారం చుట్టారు. ఇందు కోసం మార్కెటింగ్ శాఖతో సుమారు రూ.80 లక్షల నిధులు మంజూరు చేయించారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెదగదిలి వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డు మధ్యలో రైతుబజార్ నిర్మాణం కోసం రెవెన్యూ శాఖకు చెందిన సుమారు అరెకరం స్థలం కేటాయించారు. ఆ స్థలంలో రైతుబజార్ నిర్మాణం చేపట్టారు. ఈ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇంకా ప్లాట్‌ఫారం నిర్మించాల్సి ఉంది. ప్లాట్ ఫారం పనులు జరిపితే దీన్ని వినియోగంలోకి తీసుకురావచ్చు. ఇక్కడ రైతులు, డ్వాక్రా మహిళలు కూరగాయలు, ఆకుకూరలు విక్రయించడానికి 38 షాపులు, వ్యాపారుల కోసం 5 కిరాణ షాపులతో పాటు ఈవో కార్యాలయం, స్టోర్ రూం, వాచ్‌మన్ గది, పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, ఆర్‌వో ప్లాంట్ కోసం ప్రత్యేక గది నిర్మించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మిగిలిన ప్లాట్ ఫారం పనులు చేపట్టకుండా వదిలేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం జరిగిన అభివృద్ధి పనులను వినియోగంలోకి తీసుకురాలేకపోతున్నారని విమర్శిస్తున్నారు.

ఉత్సాహంగా షటిల్ టోర్నమెంట్



మెమెంటోలు అందుకున్న టోర్నమెంట్ విజేతలు

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇండోర్ స్టేడియంలో షటిల్ టోర్నమెంట్ ఉత్సాహంగా జరిగింది. ఏయూ షటిలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ పోటీలు సాగాయి. ఈ పోటీల్లో ఏయూ ఉద్యోగులు, విద్యార్థులతో పాటు పలువురు ఇతర ఉద్యోగులకు చెందిన 15 జట్లు పాల్గొనగా.. క్రీడాకారులు డబుల్స్ కేటగిరీలో తలపడ్డారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ పోటీలు సోమవారం వరకు కొనసాగాయి. తుది పోటీల్లో గవిరెడ్డి రామానాయుడు, అభిరామ్‌ల జట్టు విజేతగా నిలిచింది. సూర్యకుమార్, హితేష్‌ల జట్టు ద్వితీయ స్థానం, డొక్కర ప్రసాద్, సబ్బవరపు వెంకటేష్ జట్టు తృతీయ స్థానం, ఎం.లావణ్య యాదవ్, కృష్ణల జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. విజేతలుగా నిలిచిన జట్లకు అసోసియేషన్ ప్రతినిధులు బహుమతులు, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కోచ్‌లతో పాటు ఏయూ ఇండోర్ నిర్వాహకుడు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

25న ప్రతిభా పురస్కారాలు

ఎంవీపీ కాలనీ: పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లలో 2023–24 విద్యా సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్టు యాస్‌టీమ్ విశాఖ సంఘం ప్రధాన కార్యదర్శి డొక్కర శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతిలో 500లకు పైగా మార్కులు, ఇంటర్‌లో 900లకు పైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులు ఈ పురస్కారాలకు ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్కుల జాబితా, పాస్ ఫొటోతో కూడిన వివరాలు 81434 46565 నంబర్‌కు పంపించాలని తెలిపారు. ఈ నెల 25న శివాజీపాలెంలోని సవేరా ఫంక్షన్ హాల్‌లో ఈ పురస్కారాలు ప్రదానం చేయనున్నామన్నారు.

ప్రేమ్‌చంద్‌కు ఘన నివాళి



ప్రేమ్‌చంద్‌కి యాత్ర కహానియా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

మద్దిలపాలెం: దివంగత రచయిత ప్రేమ్‌చంద్ జయంతి వారోత్సవాలను సోమవారం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల హిందీ విభాగాధిపతి డాక్టర్ బి.లక్ష్మి.. ప్రేమ్ చంద్‌కి యాత్ర కహానీయా పేరుతో రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రేమ్‌చంద్ రచనలు భారతీయ గ్రామీణ జీవన విధానానికి దర్పణం పట్టాయన్నారు. రైతులు, ప్రజలు పడుతున్న బాధలను తన కలం ద్వారా ఆవిష్కరించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, డి.శ్రావణ్‌కుమార్, కె.రవిబాబు, ఆర్.ఆరణి, డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, ఆర్.కుసుమకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన మురుగుతో పాట్లు



పార్వతీనగర్ వద్ద రోడ్డుపై చేరిన మురుగునీరు



మురుగునీటిని దాటుతున్న పాదచారులు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు పార్వతీనగర్‌లో మురుగునీరు రోడ్డెక్కింది. మురుగునీటిలో రాకపోకలకు పాదచారులు, వాహనచోదకులు నానా పాట్లు పడ్డారు. జీవీఎంసీ అధికారులు పార్వతీనగర్, సూర్యతేజానగర్ మధ్యలో గెడ్డపై ఉన్న ఇరుకు బ్రిడ్జిని తొలగించి దాని స్థానంలో 60 నుంచి 80 అడుగుల వెడల్పుతో రెండు విశాలమైన బ్రిడ్జిలను నిర్మించారు. ప్రస్తుతం ఆ రోడ్డును ఆనుకుని ఉన్న కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. ఈ కాలువలో పార్వతీనగర్ కాలనీ నుంచి వచ్చే మురుగునీరు కిందకు వెళ్లే మార్గం సైతం మూసుకుపోయింది. దీంతో పార్వతీనగర్ వాసుల వాడుకనీరు ఇక్కడ నిలిచిపోతోంది. ఒక్కోసారి మురుగు రోడ్డు మీదకు చేరి ప్రవహిస్తోంది. రోడ్డు కూడా పాడై గోతులుపడ్డాయి. ఇటీవల నిర్మించిన కొత్త రోడ్డు నుంచి అంబేడ్కర్ కూడలికి వెళ్లే మార్గం కావడంతో ఇక్కడ నిత్యం వాహనాలు, పాదచారులతో రద్దీగా ఉంటుంది. జీవీఎంసీ అధికారులు స్పందించి మురుగునీరు నిలిచిపోకుండా కిందకు ప్రవహించేలా ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని స్థానికులు కోరుతున్నారు.

మరింత మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ

- కొండవాలులో రక్షణ చర్యలు చేపట్టాలి
- అధికారులకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం
- 47వ వార్డులో పర్యటన



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

కంచరపాలెం: కొండవాలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగు పరచాలని, కొండవాలు మెట్ల మార్గాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశించారు. 47వ వార్డు కంచరపాలెం పరిధి కప్పరాడ, రాంజీ ఎస్టేట్, సంజీవయ్యా కాలనీ కొండవాలు ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. కాలువలో పూడికలు, ఫ్లోటింగ్ మెటీరియల్ అధికంగా వస్తున్నందున వాటిని ఎప్పటికప్పుడు అదుపు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కొండవాలు ప్రాంతాల్లోని మెట్ల మార్గాల్లో రెయిలింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. నివాసాల్లోకి వర్షపు నీరు చేరుతున్నందున.. శాశ్వత పరిష్కారం కోసం రక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆయన ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో డయేరియా, అతిసార వ్యాధి, డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, దోమల వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్‌కు సూచించారు. వయసు పైబడిన పారిశుధ్య కార్మికులను కొండవాలు ప్రాంతాల నుంచి వేరొక చోటుకు మార్చివేసి సమర్థులైన కార్మికులను ఏర్పాటు చేయాలని జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణకు ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–5 ఈఈలు, మత్స్యరాజు, తారా ప్రసన్నరెడ్డి, రెవెన్యూ అధికారి(ఆర్‌వో) బాబూరావు, ఏసీపీ వెంకటరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పార్కు నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో?



విశాలాక్షినగర్‌లో మధ్యలో నిలిచిన పార్కు, లోపల పిచ్చి మొక్కలు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో పార్కు నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. కో–ఆపరేటివ్ బ్యాంక్ రోడ్డులో సీతకొండ దిగువన సుమారు ఎకరన్నర స్థలంలో జీవీఎంసీ అధికారులు రెండేళ్ల క్రితం పార్కు నిర్మాణం చేపట్టారు. ఇక్కడ పనులు ప్రారంభించిన కొద్ది రోజుల పాటు స్థలం చదును చేశారు. అనంతరం దాని చుట్టూ గోడల నిర్మాణం చేపట్టారు. ఇందులో పిల్లలు ఆడుకోవడానికి వివిధ ఆట పరికరాల ఏర్పాటు, వృద్ధులు సేదదీరడానికి బెంచీలు, నడక కోసం వెళ్లేవారికి పాత్‌వేలు నిర్మించాల్సి ఉంది. ఆ పనులు ఏవీ చేపట్టకుండా అధికారులు వదిలేశారు. దీంతో ఈ స్థలం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. పార్కు స్థలంలో దట్టంగా మొలిచిన పిచ్చి మొక్కలు పాములు, కీటకాలకు నిలయంగా మారాయి. అధికారులు దృష్టిపెట్టి పనులు పూర్తి చేయించి పార్కును వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

జీతాలు చెల్లించండి సారూ..

- స్టీల్‌ప్లాంట్ యువ కార్మికుల విజ్ఞప్తి
- అడ్మిన్ విభాగ కూడలి వద్ద ‘తాలీ బజావో’



స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ కూడలి వద్ద తాలీ బజావో నిర్వహిస్తున్న యువ కార్మికులు

ఉక్కునగరం: ప్రతీ నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలంటూ స్టీల్‌ప్లాంట్ యువకార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్లకార్డులతో ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద నిరసన తెలుపుతున్నారు. అందులో భాగంగా కార్మికులు సోమవారం తాలీ బజావో (ప్లేట్ల చప్పుడు) తో తమ ఆవేదన తెలియజేశారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ప్లేట్లు, గరిటలతో శబ్దం చేస్తూ తమ ఘోష వినాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ కోసం కష్టపడే కార్మికులకు ఇంతవరకు జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ప్రతీ నెలా జీతాల చెల్లింపు విషయంలో యాజమాన్యం కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. తద్వారా కార్మికులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే జీతాల చెల్లింపునకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మాల కనకరెడ్డి, ప్రతిమ, అట్టా అప్పారావు, జెర్రిపోతుల రమణ, వియ్యపు కిరణ్, దుల్ల గోపీ తదితరులు పాల్గొన్నారు. డీవైఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి బి.డేవిడ్ వారికి మద్దతు తెలిపారు.

లీకవుతున్న భూగర్భ డ్రైనేజీలు



సింహాద్రిపురంలో లీకైన భూగర్భ డ్రైనేజీ

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులో కొండవాలు ప్రాంతమైన సింహాద్రిపురం కాలనీ నుంచి పాత వెంకోజీపాలెం వరకూ ఉన్న భూగర్భ డ్రైనేజీలు తరచూ లీకవుతున్నాయి. దీంతో దుర్వాసన భరించలేకపోతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు ఈ మురుగునీటిని దాటి వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. రోజూ ఇదే సమస్యతో నరకం అనుభవిస్తున్నామని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పాత వెంకోజీపాలెంలో రామాలయం వెనక మార్గంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

900 కేజీల పీడీఎస్ రైస్ పట్టివేత

అక్కిరెడ్డిపాలెం: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ రైస్‌ను సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. ఆటోనగర్‌లో అప్పల నాయుడు అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 900 కేజీల పీడీఎస్ రైస్‌ను సోమవారం ఏపీ 31టీడబ్ల్యూ 5484 నంబర్ గల ఆటోలో తరలిస్తుండగా గాజువాక పోలీసులు గుర్తించి సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న సివిల్ సప్లై ఆర్‌ఐ రవికుమార్ వీఆర్వోలతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆటోను గాజువాక పోలీస్ స్టేషన్‌కు అప్పగించి, రైస్‌ను స్వాధీనం చేసుకున్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీనియర్ డీపీవో రంజన్, ఇతర ఉన్నతాధికారులు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, పర్సనల్ బ్రాంచ్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయంలో గల పర్సనల్ బ్రాంచిలో సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్, పర్సనల్ బ్రాంచ్ రిక్రియేషన్ క్లబ్ కన్వీనర్ రంజన్ మహంతి, క్లబ్ సెక్రటరీ ఎం.రమేష్ నేతృత్వంలో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు రక్తదాన సేకరణలో భాగస్వాములవ్వడం సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 56 మంది ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

పెదగంట్యాడ: స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల మూడో విడత భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కె శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26 లోగా iti.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. ఆన్‌లైన్ దరఖాస్తు కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు ఈ నెల 29న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల సేవలో ప్రేమ సమాజం



ఆశ్రయులకు వస్త్రాలు అందిస్తున్న డాక్టర్ దిలీప్‌కుమార్, ప్రేమ సమాజం కమిటీ సభ్యులు

దాబాగార్డెన్స్: ప్రేమ సమాజం కుష్టు శరణాలయం 70వ వార్షికోత్సవం సోమవారం ప్రేమ సమాజంలోని న్యూ మీటింగ్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎండోక్రైనాలజిస్ట్ వైద్య నిపుణుడు డాక్టర్ దిలీప్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. ప్రేమ సమాజం చేపడుతున్న సేవలన్నింటి కన్నా కుష్టు రోగులకు ఆశ్రయం కల్పించి సేవలందించే కార్యక్రమం మహోన్నతమైందన్నారు. సంస్థ అధ్యక్షుడు బుద్ధా శివాజీ మాట్లాడుతూ ఈ సంస్థలో వైద్య సేవలు పొందిన రోగులు తిరిగి మామూలు స్థితికి చేరుకుని, తమ ఇళ్లకు వెళ్లిపోగా, ప్రస్తుతం 13 మంది మాత్రమే ఉన్నారని చెప్పేందుకు ఎంతో గర్విస్తున్నామన్నారు. అనంతరం కుష్టు శరణాలయంలో ఆశ్రయం పొందుతున్న వారికి నూతన వస్త్రాలు అందజేశారు. సంస్థ ఉపాధ్యక్షులు మట్టుపల్లి హనుమంతరావు, కేశాప్రగడ నర్సింహమూర్తి, కార్యదర్శి కె.హరిమోహనరావు, కోశాధికారి ఎం.వి.వి.కె.గుప్తా, సలహాదారుడు విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.